Neti Velugu నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

తెలుగు దినపత్రిక

RNI NO. TELTEL/2023/88559

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com

పాఠకులకు గమనిక

దీపావళి పండుగను పురస్కరించుకుని 08-11-26 , పత్రికకు సెలవు. తదుపరి సంచిక 10-11-26 యథావిధిగా వెలువడుతుంది.

యాజమాన్యం



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 204 | పేజీలు : 4 | నవంబర్ 8 ఆదివారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 204 | PAGES:4 | SUNDAY NOVEMBER 8 2026 | Rs. 4:00

ఇరాన్‌తో యుద్ధమే లేదు.. ఇజ్రాయెల్‌ను నేనే కాపాడాను: ట్రంప్



ఇరాన్‌తో జరుగుతున్నది యుద్ధం కాదన్న ట్రంప్

గత ఐదు నెలలుగా ఎవరూ చనిపోలేదని వెల్లడి

ఇరాన్ నుంచి ఇజ్రాయెల్‌ను తానే కాపాడానని వ్యాఖ్య

ఇరాన్ అణు కార్యక్రమం శాంతియుతమేనని టెహ్రాన్ స్పష్టీకరణ

ఇరాన్‌తో నెలకొన్న ఘర్షణను 'యుద్ధం'గా పరిగణించలేమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో వాషింగ్టన్ గణనీయమైన పురోగతి సాధించిందని, ఘర్షణకు ముందు కంటే ఇప్పుడే తాము ఎక్కువ చమురును పొందుతున్నామని పేర్కొన్నారు. "గత ఐదు నెలలుగా ఈ ఘర్షణలో ఎవరూ గాయపడలేదు, చనిపోలేదు. అలాంటప్పుడు దీన్ని యుద్ధం అని ఎలా అంటారు? ఇది యుద్ధం కాదు" అని ట్రంప్ స్పష్టం చేశారు.ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యల భవిష్యత్ కార్యాచరణపై అనిశ్చితి

(మిగతా 2వ పేజీలో..)

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే.. రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక!


సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానన్న సీఎం రేవంత్

ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం

ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ

రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన

గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు



ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు

(మిగతా 2వ పేజీలో..)

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్



కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్

రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ

ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు.ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు.ఈ

(మిగతా 2వ పేజీలో..)

డిండికి ఏదుల నుంచి నీళ్లు తేవడం అసాధ్యం: కవిత



నల్లగొండ: ఏదుల నుంచి డిండి రిజర్వాయర్‌కు నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గోదావరి జలాలను నల్లగొండ ప్రాంతానికి తీసుకొస్తేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అభిప్రాయపడ్డారు. శనివారం డిండి రిజర్వాయర్‌ను సందర్శించిన ఆమె, నీటి ప్రాజెక్టులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏదుల నుంచి నీటిని తరలించే ప్రతిపాదనలో సాంకేతిక, ఆచరణాత్మక ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనుల కారణంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం దెబ్బతిన్నదని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకే నీటిని అందించడానికి ఎక్కువ సమయం పడుతుందని, ఈ పరిస్థితుల్లో నల్లగొండకు నీటిని తీసుకురావడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు.

బస్వాపూర్ నుంచి నీటిని అందించవచ్చు..

బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి ఉల్పర, శివన్నగూడెం ప్రాంతాలకు నేరుగా గోదావరి జలాలను అందించే అవకాశం ఉందని కవిత వివరించారు. తమ ప్రతిపాదనలోని ప్రయోజనాలను నల్లగొండ జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించాలని సూచించారు. అవసరమైతే ఇంజినీర్లతో సాంకేతికంగా తనిఖీ చేయించుకోవాలని కోరారు. ఈ ప్రతిపాదన అమలైతే ప్రాంతానికి ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ఎస్ఎల్‌బీసీ పనులపై విమర్శలు..

ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు నత్తనడకన సాగుతున్నాయని కవిత విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్లే సొరంగంలో కార్మికులు మృతి చెందారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా టన్నెల్ పనుల విషయంలో కొంత నిర్లక్ష్యం చేసిందని అంగీకరిస్తూ, అందుకు క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొన్నారు.

తుపాకులగూడెం వద్ద నదుల అనుసంధానం..

గోదావరి--కావేరి నదుల అనుసంధాన ప్రక్రియ తుపాకులగూడెం వద్దే చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై విమర్శలు చేస్తూ,

(మిగతా 2వ పేజీలో..)

ఎమర్జెన్సీపై ఇన్నాళ్లకు కీలక వ్యాఖ్యలు.. ఇందిర గురించి సోనియా ఏం చెప్పారంటే?

ఎమర్జెన్సీ అకృత్యాలపై ఇందిర క్షమాపణలు చెప్పారని సోనియా వెల్లడి

సంజయ్ ఒక్కడినే బాధ్యుడిగా చూడకూడదని వ్యాఖ్య

ఇందిరపై సీనియర్ నేతల ఒత్తిడి ఉండేదని వెల్లడి

రాజీవ్ ప్రజల ఫిర్యాదులను తల్లి దృష్టికి తీసుకెళ్లేవారని వివరణ

1977 మార్చిలో ఇందిరే ఎన్నికలకు పిలుపునిచ్చారని వ్యాఖ్య



ఎమర్జెన్సీ సమయంలో జరిగిన అకృత్యాలపై మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తర్వాతి కాలంలో పశ్చాత్తాపం వ్యక్తం చేశారని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తెలిపారు. ఆ ఘటనలకు బహిరంగంగా క్షమాపణలు కూడా చెప్పారని వెల్లడించారు. ఎమర్జెన్సీకి సంజయ్‌గాంధీ ఒక్కరినే బాధ్యుడిగా చూడకూడదని స్పష్టం చేశారు. 'ది హిందూ' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సోనియా ఈ విషయాలు వెల్లడించారు. ఎమర్జెన్సీ అనగానే ప్రజలకు సంజయ్‌గాంధీ గుర్తుకొస్తారని అన్నారు. కానీ అప్పట్లో ఇందిరాగాంధీపై సీనియర్ నేతల నుంచి కూడా ఒత్తిడి ఉండేదని చెప్పారు. ఆమె చుట్టూ భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం

(మిగతా 2వ పేజీలో..)

విద్యార్థులకు విజయ్ సర్కార్ భారీ కానుక.. ఏకంగా రూ.2,000 కోట్లు!



విద్యార్థుల ఉచిత ల్యాప్‌టాప్‌ల కోసం రూ.2,000 కోట్లు మంజూరు

పథకానికి 'వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్'గా పేరు

డిగ్రీ, డిప్లొమా మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు అవకాశం

పలు ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకూ వర్తింపు

ల్యాప్‌టాప్‌లలో ఇంటెల్ కోర్ ఐ5 ప్రాసెసర్ ఉండేలా నిర్ణయం

తమిళనాడు విద్యార్థులకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుభవార్త చెప్పారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందించేందుకు

(మిగతా 2వ పేజీలో..)

'E20 కాస్తా 420గా మారింది'.. ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ

పెట్రోల్‌లో పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారని ఆయిల్ కంపెనీలపై రాహుల్ ఆరోపణ

కర్ణాటక ప్రభుత్వ ల్యాబ్ టెస్టుల్లో 31శాతం వరకు ఇథనాల్ ఉన్నట్లు వెల్లడైందని వ్యాఖ్య

తమపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా ఖండించిన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలు

ఈ వివాదంతో వాహనాల మైలేజీ, ఇంజిన్ల భద్రతపై వినియోగదారుల్లో పెరిగిన ఆందోళన

దేశంలోని ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌లో ప్రభుత్వం నిర్దేశించిన 20 శాతం పరిమితికి మించి ఇథనాల్ కలుపుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన ల్యాబొరేటరీ పరీక్షల



ఫలితాలను ఉటంకిస్తూ ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇ20 కాస్తా 420గా మారింది -- ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారు!" అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో విమర్శించారు. చమురు సంస్థల టెస్టింగ్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన ప్రశ్నించారు. కర్ణాటక ఆహార, పౌర

(మిగతా 2వ పేజీలో..)

తెలుగు రాష్ట్రాల ప్రజలకు సీఎంల దీపావళి శుభాకాంక్షలు

అమరావతి, హైదరాబాద్, నవంబరు 7 :

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఇరువురు ముఖ్యమంత్రులు ప్రకటనలు విడుదల చేశారు. ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి: చంద్రబాబు

చెడుపై మంచి సాధించిన

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

సం పా ద కీ యం

రక్తదానం.. ప్రాణదానానికి మించిన మహాదానం లేదు!

మనిషి ప్రాణాన్ని నిలబెట్టడంలో రక్తానికి ఉన్న ప్రాధాన్యం అపారం. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయ సమస్యలు, క్యాన్సర్ చికిత్సలు, ఇతర తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో రక్తం అవసరం ఏర్పడుతుంది. ఆధునిక వైద్యం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ రక్తానికి కృత్రిమ ప్రత్యామ్నాయం అందుబాటులో లేదు. అవసరమైన సమయంలో సరైన రక్తం అందకపోతే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. అందుకే స్వచ్ఛంద రక్తదానం సమాజంలో అత్యంత విలువైన సేవగా గుర్తింపు పొందింది.ఒకరు ఇచ్చిన రక్తం మరొకరి జీవితాన్ని నిలబెట్టగలదు. డబ్బు, ఆస్తి, ఇతర వస్తువులను దానం చేయడం కంటే ప్రాణాలను కాపాడే రక్తదానం ఎంతో ప్రత్యేకమైనది. అయితే రక్తదానంపై ఇప్పటికీ కొంతమందిలో అపోహలు, భయాలు కొనసాగుతున్నాయి. రక్తదానం చేస్తే బలహీనత వస్తుందని, ఆరోగ్యం దెబ్బతింటుందని భావించడం సరికాదు. అర్హత కలిగిన ఆరోగ్యవంతులు వైద్యుల సూచనల మేరకు రక్తదానం చేయవచ్చు.

అపోహలను వీడి ముందుకు రావాలి

రక్తదానంపై ప్రజల్లో సరైన అవగాహన పెరగాలి. రక్తదానం చేసిన వెంటనే శరీరంలో రక్త పరిమాణం తగ్గిపోతుందని, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు వస్తాయని కొందరు భయపడుతుంటారు. వాస్తవానికి నిర్దేశించిన వైద్య ప్రమాణాలను పాటిస్తూ, ఆరోగ్య పరీక్షల అనంతరం అర్హులైన వ్యక్తుల నుంచి మాత్రమే రక్తాన్ని సేకరిస్తారు. దానం చేసిన ద్రవ భాగాన్ని శరీరం త్వరగా భర్తీ చేసుకుంటుంది. రక్తంలోని కణాలు కూడా సహజ ప్రక్రియ ద్వారా తిరిగి ఉత్పత్తి అవుతాయి.అయితే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి అర్హులు కారు. వయసు, బరువు, హీమోగ్లోబిన్ స్థాయి, ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను వైద్య సిబ్బంది పరిశీలించాలి. తాత్కాలిక అనారోగ్యం లేదా కొన్ని వైద్య పరిస్థితులు ఉన్నప్పుడు రక్తదానాన్ని వాయిదా వేయాల్సి రావచ్చు. అందువల్ల నిపుణుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి.

అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండాలి

రోడ్డు ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవ సమస్యలు ఎప్పుడు ఎదురవుతాయో చెప్పలేం. అలాంటి సమయంలో రక్తం కోసం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి రాకుండా రక్తనిధులు తగిన నిల్వలను నిర్వహించాలి. ముఖ్యంగా అరుదైన రక్తగ్రూపులు అవసరమైనప్పుడు సరైన సమయంలో దాతలను గుర్తించడం సవాలుగా మారుతోంది.ప్రతి జిల్లాలో రక్తనిధుల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రక్తదాతల వివరాలను క్రమబద్ధంగా నిర్వహించాలి. అత్యవసర అవసరాల కోసం సంప్రదించగల స్వచ్ఛంద దాతల వ్యవస్థ ఉండాలి. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ అవసరమైనప్పుడు మళ్లీ ముందుకు రావడం, ఇతరులను ప్రోత్సహించడం ద్వారా ఈ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.

యువతలో సేవాభావం పెరగాలి

యువతలో శక్తి, ఉత్సాహం, సామాజిక బాధ్యత ఎక్కువగా ఉంటాయి. ఈ శక్తిని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల వైపు మళ్లించాలి. విద్యార్థులు, ఉద్యోగులు, యువజన సంఘాలు స్వచ్ఛంద రక్తదాన శిబిరాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. అయితే రక్తదానాన్ని కేవలం ఒక కార్యక్రమంగా నిర్వహించి ముగించకుండా నిరంతర సేవగా కొనసాగించాలి.కళాశాలలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలు, అర్హతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి. యువతలో సేవాభావం పెరిగితే అత్యవసర సమయాల్లో రక్తం కోసం ఎదురుచూసే కుటుంబాలకు ఎంతో ఊరట లభిస్తుంది.

మహిళల భాగస్వామ్యానికీ ప్రోత్సాహం

రక్తదాన కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం కూడా పెరగాలి. అయితే రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా లేకుండా రక్తదానం చేయకూడదు. మహిళల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, తగిన అర్హత ఉన్నవారిని మాత్రమే రక్తదానానికి అనుమతించాలి.మహిళల్లో పోషకాహారం, రక్తహీనత నివారణపై అవగాహన పెంచడం కూడా ముఖ్యమే. ఆరోగ్యవంతమైన మహిళలు స్వచ్ఛంద రక్తదానంలో పాల్గొనేలా ప్రోత్సహించడంతో పాటు వారి ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

రక్తదానం పేరుతో వ్యాపారాలకు అడ్డుకట్ట

రక్తం ప్రాణాలను కాపాడే విలువైన వైద్య వనరు. దాని సేకరణ, పరీక్షలు, నిల్వ, పంపిణీ అన్నీ నిర్దిష్ట వైద్య ప్రమాణాల ప్రకారం జరగాలి. రక్తం పేరుతో అక్రమ వసూళ్లు, నకిలీ రక్తనిధులు, నాణ్యత లేని సేకరణ పద్ధతులకు అవకాశం ఇవ్వకూడదు. ప్రభుత్వ, ప్రైవేటు రక్తనిధులపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి.సేకరించిన రక్తాన్ని అవసరమైన రక్తపరీక్షలు, సంక్రమణ వ్యాధుల పరీక్షలు నిర్వహించిన తర్వాతే వినియోగించాలి. రక్తాన్ని సురక్షితంగా నిల్వ చేసి, అవసరమైన రోగులకు అందించే వ్యవస్థ పారదర్శకంగా ఉండాలి. స్వచ్ఛంద రక్తదాతల సేవలను గౌరవిస్తూనే రక్తనిధుల నిర్వహణలో వైద్య ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి.

రక్తదానంపై నిరంతర అవగాహన అవసరం

ప్రతి సంవత్సరం రక్తదాన దినోత్సవాల సందర్భంగా శిబిరాలు నిర్వహించడం మంచి పరిణామమే. కానీ రక్తం అవసరం పండుగలు లేదా ప్రత్యేక దినాలకు మాత్రమే పరిమితం కాదు. ఏడాది పొడవునా రక్తం అవసరమయ్యే రోగులు ఉంటారు. అందువల్ల రక్తదానాన్ని ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర సామాజిక ఉద్యమంగా మార్చాలి. రక్తగ్రూపులపై అవగాహన కల్పించడం, స్వచ్ఛంద దాతలను ప్రోత్సహించడం, అత్యవసర రక్త అవసరాలపై సరైన సమాచారం అందించడం వంటి చర్యలు చేపట్టాలి.

కాడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. “క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి” అని అన్నారు.ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

డిండికి ఏడుల నుంచి నీళ్లు తేవడం అసాధ్యం: కవిత

మొదటి పేజీ తరువాయి)

రేసుగుర్రంలా పనిచేస్తామని చెప్పిన ప్రభుత్వం కీలు గుర్రంలా మారిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చెప్పిన విషయాలనే మళ్లీ మళ్లీ చెబుతున్నారని విమర్శించారు.

రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి..

పంటలు వేయవద్దని సూచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ప్రత్యామ్నాయ సహాయం అందిస్తుందో స్పష్టం చేయాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, బీఆర్ఎస్ నిద్రమత్తును వదిలించాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే.. రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక!

మొదటి పేజీ తరువాయి)

విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు.మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళ్తున్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశాల్లో ఎల్‌నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు.కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాలు పెంచడంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకూ సీఎం సమాధానమిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం ఇస్తోందన్నారు. హైదరాబాద్-లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కేటీఆర్ వేషభాషలు మార్చుకున్నా ప్రజలు నమ్మరని రేవంత్ ఎద్దేవా చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరని వ్యాఖ్యానించారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, అబద్ధాలు ప్రచారం చేస్తున్న కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు విజయ్ సర్కార్ భారీ కానుక.. ఏకంగా రూ.2,000 కోట్లు!

మొదటి పేజీ తరువాయి)

రూ.2,000 కోట్లు మంజూరు చేశారు. ‘వెట్రి ల్యాప్‌టాప్ పథకం’ పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకానికి ప్రభుత్వం తాజాగా పరిపాలనా అనుమతులు జారీ చేసింది.ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరంలో మొదటి, రెండో ఏడాది డిగ్రీ, డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించనున్నారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఆర్ట్స్, సైన్స్, వైద్య, న్యాయ, వ్యవసాయ, పశువైద్య, మత్స్యశాస్త్ర కోర్సుల విద్యార్థులు కూడా ఈ పథకానికి అర్హులు. గత విద్యా సంవత్సరంలో ల్యాప్‌టాప్‌లు అందుకోని ప్రొఫెషనల్ కోర్సుల మూడు, నాలుగో ఏడాది విద్యార్థులకూ అవకాశం కల్పించారు.ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి సామర్థ్యం ఉన్న ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఇంటెల్ కోర్ ఐ5 ప్రాసెసర్ లేదా దానికి సమానమైన సాంకేతికత ఉండనుంది.పథకం అమలును పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ల్యాప్‌టాప్‌ల కొనుగోలు బాధ్యతను ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ తమిళనాడు (ELCOT)కు అప్పగించారు. నాణ్యత, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పరికరాలను కొనుగోలు చేయనున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఆన్‌లైన్ తరగతులు, సాంకేతిక నైపుణ్యాల అభ్యాసం, ఉద్యోగ అవకాశాలకు సిద్ధమయ్యేందుకు ఈ ల్యాప్‌టాప్‌లు ఉపయోగపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఎమర్జెన్సీపై ఇన్నాళ్లకు కీలక వ్యాఖ్యలు.. ఇందిర గురించి సోనియా ఏం చెప్పారంటే?

మొదటి పేజీ తరువాయి)

చేసినవారిలో రాజీవ్‌గాంధీ కూడా ఉన్నారని తెలిపారు. ప్రజలు చెప్పిన సమస్యలు, ఫిర్యాదులను రాజీవ్ తన తల్లి దృష్టికి తీసుకెళ్లేవారని పేర్కొన్నారు.ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య హక్కులు నిలిపివేశారని సోనియా అంగీకరించారు. హేబియస్ కార్పస్ హక్కును కూడా రద్దు చేశారని చెప్పారు. అయితే అప్పటి పరిస్థితులు ఇందిరాగాంధీని తీవ్ర ఒత్తిడికి గురిచేశాయని వివరించారు. హింసాత్మక ఆందోళనలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా రవాణా వ్యవస్థపై దాడులు జరిగాయని గుర్తుచేశారు. ప్రభుత్వ అధికారులు, సాయుధ దళాలు ఆదేశాలను ధిక్కరించాలన్న పిలుపులు కూడా వచ్చాయని తెలిపారు.తర్వాత పరిస్థితులను అర్థం చేసుకున్న ఇందిరాగాంధీనే 1977 మార్చిలో ఎన్నికలకు పిలుపునిచ్చారని సోనియా గుర్తుచేశారు.నవంబరు 10న సోనియా రాసిన ‘బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్’ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ ఇంటర్వ్యూను రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పంచుకున్నారు. ప్రజా జీవితంలో ఆరు దశాబ్దాలు గడిచినా తన తల్లి వ్యక్తిత్వం మారలేదని, ఆమె తన తల్లి కావడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

‘E20 కాస్తా 420గా మారింది’.. ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి)

సరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ విడుదల చేసిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ శాంపిల్స్‌ను ప్రభుత్వ గుర్తింపు పొందిన ల్యాబ్‌లో పరీక్షించగా, 11 శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 20కి మించి ఉన్నట్లు తేలింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) శాంపిల్‌లో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) శాంపిల్‌లో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), నయారా ఎనర్జీ, షెల్ వంటి సంస్థల నుంచి సేకరించిన ఇతర శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 25.5 నుంచి 26.5 మధ్య ఉన్నట్లు తేలింది. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల్లో ఈ శాంపిల్స్‌ను సేకరించారు.అధిక మోతాదులో ఇథనాల్ కలపడం వల్ల వాహనదారుల మైలేజీ తగ్గడమే కాకుండా ఇంజిన్‌లు దెబ్బతినే ప్రమాదం ఉందని మంత్రి రిజ్వాన్ అర్షద్ ఆందోళన వ్యక్తం చేశారు. మొదట ఈ శాంపిల్స్‌ను ఆయిల్ కంపెనీల ల్యాబ్‌లకు పంపగా, వారు ఇథనాల్ శాతం వివరాలు వెల్లడించలేదని, అందుకే స్వతంత్ర ల్యాబ్‌లో పరీక్షలు చేయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు.

ఆరోపణలను ఖండించిన చమురు సంస్థలు

అయితే, కర్ణాటక ప్రభుత్వం, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సహా అన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు తీవ్రంగా ఖండించాయి. శాంపిల్స్ సేకరణ, పరీక్షా విధానాలు నిర్దేశిత చట్టబద్ధమైన మార్గదర్శకాల ప్రకారం జరగలేదని ఆక్షేపించాయి. తాము దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 893 శాంపిల్స్‌తో జాయింట్ క్వాలిటీ మానిటరింగ్ నిర్వహించామని, అందులో కర్ణాటకకు చెందిన 56 శాంపిల్స్ కూడా ఉన్నాయని తెలిపాయి. ఈ పరీక్షల్లో ఇథనాల్ శాతం 19 నుంచి 21 శాతం మధ్యలోనే ఉందని, కర్ణాటక శాంపిల్స్‌లో సగటున 19.3 శాతంగానే నమోదైందని స్పష్టం చేశాయి. ఈ తాజా వివాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం, దాని ప్రభావంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. వాహనాల పనితీరు, వినియోగదారులపై పడుతున్న భారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరాన్‌తో యుద్ధమే లేదు.. ఇజ్రాయెల్‌ను నేనే కాపాడాను: ట్రంప్

మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికీ సైనిక ప్రత్యామ్నాయాలపై చర్చిస్తున్నప్పటికీ, ఇది యుద్ధం కాదని ఆయన నొక్కి చెప్పడం గమనార్హం.మరోవైపు, ఇరాన్ అణ్వస్త్ర దేశంగా మారకుండా తాను అడ్డుకోకపోయి ఉంటే, ఈ రోజు ఇజ్రాయెల్ సహా మొత్తం పశ్చిమాసియా ఉనికిలో ఉండేది కాదని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఈ మేరకు ఒక పోస్ట్ చేశారు. ఇరాన్ అణు ఆశయాలను అడ్డుకోవడంలో తన పాత్ర అందరికీ తెలిసినా, ఎవరూ బహిరంగంగా అంగీకరించరని ఆయన పేర్కొన్నారు. “నేను ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా ఆపకపోతే ఇజ్రాయెల్, వాస్తవానికి మొత్తం పశ్చిమాసియా ఈరోజు ఉండేది కాదు. ఈ నిజాన్ని ఎవరూ చెప్పరు, కానీ అందరికీ తెలుసు!” అని ట్రంప్ తన పోస్టులో రాసుకొచ్చారు.ఇరాన్ అణ్వస్త్రాలను అభివృద్ధి చేయకుండా నిరోధించడమే లక్ష్యంగా 2025, 2026 సంవత్సరాల్లో అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలపై భారీ దాడులు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ దాడుల వల్ల ఇరాన్ అణు కార్యక్రమానికి ఎంత నష్టం వాటిల్లిందనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. అక్టోబర్‌లో వెలువడిన కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) నివేదిక ప్రకారం.. ఈ దాడులు ఇరాన్ అణ్వస్త్ర సామర్థ్యాన్ని ఎంతవరకు ప్రభావితం చేశాయో చెప్పడం కష్టమని పేర్కొంది. అంతేకాకుండా గతంలో చేసిన అంచనాల ప్రకారం, ఇరాన్ అసలు అణ్వస్త్రాలను నిర్మించడం లేదని కూడా ఆ నివేదిక గుర్తు చేసింది. మరోవైపు, తమ అణు కార్యక్రమం కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని, అణ్వస్త్రాలను అభివృద్ధి చేసే ఉద్దేశం తమకు లేదని ఇరాన్ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది.

తెలుగు రాష్ట్రాల ప్రజలకు సీఎంల దీపావళి శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి)

విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు చిగురించాలని కోరుకున్నారు. మనం వెలిగించే దీపం మన ఇంటికే పరిమితం కాకుండా సమాజానికి కూడా వెలుగునివ్వాలని అభిలాషించారు. ఇతరుల జీవితాల్లో సంతోషాన్ని నింపేలా పండుగలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఐకమత్యం, పరస్పర సహకారంతో అందరూ ముందుకు సాగాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

తెలంగాణ ప్రజలకు రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు.

క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే ప్రాణాలను కాపాడవచ్చు





- **ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకట రమణ**

మోతే, నవంబర్ 7 (నేటి వెలుగు):

క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతను తెలియజేయడమే లక్ష్యంగా జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మోతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకట రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నవంబర్ 7వ తేదీన జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించినట్లయితే మెరుగైన చికిత్స అందించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. పొగాకు వినియోగం, ధూమపానం, మద్యపానం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడం వంటి అంశాలు కొన్ని రకాల క్యాన్సర్లకు ప్రమాద కారకాలుగా మారుతాయని వివరించారు. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు. నోటిలో పుండ్లు దీర్ఘకాలంగా తగ్గకపోవడం, రొమ్ములో గడ్డలు, అసాధారణ రక్తస్రావం, కారణం తెలియకుండా బరువు తగ్గడం, దీర్ఘకాలిక దగ్గు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు సంబంధించి ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు 14 సంవత్సరాలు నిండిన ప్రతి బాలికకు సిఫార్సు చేసిన హెచ్ పి వి వ్యాక్సిన్ ఒక డోసు వేయించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, పరీక్షలు, చికిత్సపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. చంద్రశేఖర్, వైద్యాధికారులు డాక్టర్ భవాని, డాక్టర్ శ్రీనివాస రాజు, డిప్యూటీ డెమో వి. సంజీవ్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేస్తే కఠిన చర్యలు





- **ఫ్లోర్ క్లీనింగ్‌కు తాగునీరు వినియోగం.. సంస్థకు రూ.20 వేల జరిమానా**
- **మురుగునీటి కనెక్షన్ తాత్కాలికంగా తొలగించిన జలమండ**

హైదరాబాద్, నవంబర్ 7 (నేటి వెలుగు):

నగరంలో తాగునీటి వృథా, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జలమండలి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. రానున్న వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ప్రతి నీటి బొట్టును సంరక్షించాలనే లక్ష్యంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 70లోని జర్నలిస్టు కాలనీలో ఫ్లోర్ క్లీనింగ్ కోసం తాగునీటిని వినియోగిస్తున్నట్లు గుర్తించిన జలమండలి అధికారులు సంబంధిత సంస్థకు రూ.20 వేల జరిమానా విధించి వసూలు చేశారు. జర్నలిస్టు కాలనీలోని ఇంటి నంబర్ 8-2-293/82/జె/ఏ/24లో మహమ్మద్ జరీనా బేగం పేరుతో ఉన్న నీటి కనెక్షన్ (క్యాన్ నెంబర్. 061112041) పరిధిలోని ప్రాంగణాన్ని అక్షయకల్ప ఫార్మ్ అండ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వినియోగిస్తోంది. ఈ ప్రాంగణంలో ఫ్లోర్ క్లీనింగ్‌కు తాగునీటిని ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో రూ.20 వేల జరిమానా విధించడంతో పాటు మురుగునీటి కనెక్షన్‌ను తాత్కాలికంగా తొలగించారు. నగరవ్యాప్తంగా తాగునీటి దుర్వినియోగంపై తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఫిర్యాదులకు వాట్సాప్ నంబర్ 99499 30003 నగరంలో ఎక్కడైనా తాగునీటిని వృథా చేస్తున్నా, దుర్వినియోగం చేస్తున్నా ప్రజలు వెంటనే జలమండలికి ఫిర్యాదు చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. సంబంధిత ప్రాంత వివరాలతో పాటు ఫొటోలు లేదా వీడియోలను 99499 30003 వాట్సాప్ నంబర్‌కు పంపించాలని సూచించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి





పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: ప్రభుత్వ విప్ వేముల వీరేశం

రామన్నపేట, నవంబర్ 7 (నేటి వెలుగు):

మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు సమర్థవంతంగా అందించాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో, మెరుగైన నాణ్యతతో అందించాలని సూచించారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ (), ఎంపీడీఓ, వివిధ శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

దీపావళి వెలుగులు ప్రతి ఇంటా నిండాలి

రాష్ట్ర ప్రజలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుభాకాంక్షలు



హైదరాబాద్, నవంబర్ 7 (నేటి వెలుగు):

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీకటిని పారద్రోలి వెలుగులు నింపే దీపావళి పండుగ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. దీపావళి వేడుకలను పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవాలని, కాలుష్యాన్ని తగ్గించే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండ

- **60 మంది లబ్ధిదారులకు రూ.33.55 లక్షల చెక్కులు పంపిణీ చేసిన శాసన మండలి చైర్మన్ గుత్తా**



నల్గొండ, నవంబర్ 7 (నేటి వెలుగు):

వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 60 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.33,55,500 విలువైన చెక్కులను తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శనివారం నల్గొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే లక్షలాది మంది పేదలకు సహాయం అందిందని తెలిపారు. ఆపద సమయంలో నిరుపేదలకు ప్రభుత్వ సహాయం అందించడం సంతోషంగా ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఘనంగా 76వ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫ్లాగ్ డే

- **విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్యసాహసాలు పెంపొందించాలి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**





నల్లగొండ జిల్లా నవంబర్ 07(నేటి వెలుగు):

నల్లగొండ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 76వ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫ్లాగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధ్యక్షులు బి. చంద్రశేఖర్ ఐఏఎస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఇ. కరుణాకర్ కలెక్టర్‌కు స్కౌట్ స్కార్ఫ్ ధరింపజేశారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో స్కౌట్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణ, ధైర్యసాహసాలు, సేవాభావం అలవర్చుకోవాలని నిర్వాహకులు సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలో చేరడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సేవా దృక్పథం పెంపొందుతాయని తెలిపారు. తద్వారా భావి భారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఈ సంస్థ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఇ. కరుణాకర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సురేష్ గుప్తా, పర్యావరణ ప్రేమికుడు, గైడ్ కెప్టెన్ సుజాత, స్కౌట్ మాస్టర్ శీను నాయక్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆర్. విమల, సెయింట్ అల్ఫోన్సెస్ హైస్కూల్ స్కౌట్ విద్యార్థులు, కట్టంగూర్ కేజీబీవీ విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులను నవంబర్ 20లోపు పూర్తి చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశం



హుజూర్‌నగర్, అక్టోబర్ 07(నేటి వెలుగు):

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం హుజూర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ()ను ఆయన సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. నెక్ట్ జనరేషన్ సూర్యాపేటలి కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధి కోసం రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో చేపడుతున్న సివిల్ వర్క్, మేజర్, మైనర్ మరమ్మతు పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల క్రీడా మైదానాన్ని సమతలంగా అభివృద్ధి చేసి బేస్‌బాల్, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి, దాని నిర్మాణం, ఇతర ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో చేపట్టిన మిగిలిన అన్ని అభివృద్ధి పనులను నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. అనంతరం తొమ్మిదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థులను పాఠాలు చదివించి, పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాడి నర్సిరెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్, డీఈ రమేష్, ఏఈ ఓబులేష్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. సవీన్ కుమార్ గౌడ్

ఇమ్యునైజేషన్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ఏఎన్ఎంలు, ఆశాలకు డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ఆనంద్ హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 07(నేటి వెలుగు):



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ కె. ఆనంద్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ఆయన యూపీహెచ్ఎస్సి హస్మత్‌పేట్, బి డి కె అంజయ్యనగర్ ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఇమ్యునైజేషన్ సేవలు, రికార్డుల నిర్వహణ, జాతీయ



ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) కార్యక్రమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇమ్యునైజేషన్ సెషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ, లబ్ధిదారుల వివరాలు, ఇమ్యునైజేషన్ లైన్ లిస్టులు, వ్యాక్సిన్ రికార్డులు, ఉష్ణోగ్రతల నిర్వహణ, కోల్డ్‌చైన్ వ్యవస్థ, వ్యాక్సిన్ల నిల్వ, పంపిణీ విధానాలను పరిశీలించారు.ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. తమ పరిధిలోని పిల్లలు, గర్భిణుల వివరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, టీకాలు పొందని వారిని గుర్తించి, ఎలాంటి డ్రాప్‌అవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే లైన్ లిస్టులను ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల వివరాలను సంబంధిత రిజిస్టర్లు, ఎన్ హెచ్ ఎం పోర్టల్స్‌లో వెంటనే నమోదు చేయాలని సూచించారు. కేవలం రికార్డులకే పరిమితం కాకుండా వాస్తవంగా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయా లేదా అన్నది కూడా అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు.పనుల్లో జాప్యం, విధుల పట్ల నిర్లక్ష్యం, రికార్డుల నవీకరణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని డాక్టర్ కె. ఆనంద్ హెచ్చరించారు. అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అనంతరం ఆరోగ్య కేంద్రంలోని వివిధ రిజిస్టర్లు, రికార్డులు, ఎన్ హెచ్ఎం కార్యకలాపాలు, సంబంధిత పోర్టల్స్‌లో నమోదైన వివరాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజారోగ్య కార్యక్రమాల విజయవంతమైన అమలుకు బాధ్యత, సమయపాలన, జవాబుదారీతనం ఎంతో ముఖ్యమని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. ప్రతి ఏఎన్ఎం , ఆశా వర్కర్లు తమ పరిధిలోని లబ్ధిదారులకు నిరంతర ఆరోగ్య సేవలు అందిస్తూ, ఒక్కరు కూడా ప్రభుత్వ వైద్య సేవలకు దూరం కాకుండా చూడాలని ఆదేశించారు.

పల్లవి మోడల్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు

- **విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టతపై అవగాహన**
- **సంప్రదాయాలు, ఆచారాలపై ప్రత్యేక వివరణ**
- **దీపం,ఓం,స్వస్తిక్, పీఎంఎస్ ఆకృతులతో విద్యార్థుల కనువిందు**
- **చెడుపై మంచి, చీకటిపై వెలుగు విజయానికి ప్రతీక దీపావళి**
- **ఆనందంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి**
- **పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి**

పర్వతగిరి, నవంబర్ 07,(నేటి వెలుగు):

పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యత, దాని వెనుక ఉన్న ఉద్దేశం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి మాట్లాడుతూ దీపావళి వెలుగుల పండుగ అని, చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటామని తెలిపారు. దీపాలు వెలిగించడం ద్వారా ఇళ్లలోనే కాకుండా మన ఆలోచనల్లోనూ మంచి వెలుగును నింపుకోవాలని విద్యార్థులకు సూచించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ బంధాలను గుర్తుచేస్తాయని పేర్కొన్నారు.చదువుతో పాటు మన పండుగల విశిష్టత, వాటి వెనుక ఉన్న సందేశాలు, ఆచారాల గురించి కూడా విద్యార్థులు తెలుసుకోవడం అవసరమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. పెద్దలు పాటించే మంచి సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటి ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలని సూచించారు. దీపావళి వేడుకలను ఆనందంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణం, ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు దీపం, ఓం, స్వస్తిక్, పీఎంఎస్ ఆకృతులను అందంగా రూపొందించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు పండుగ విశేషాలను ఆసక్తిగా తెలుసుకుంటూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కొటగిరి రమేష్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బిక్షం గౌడ్‌కు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

తెలిపిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి





మునుగోడు, నవంబర్ 7 (నేటి వెలుగు):

మునుగోడులోని పీఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర సంఘం మాజీ అధ్యక్షుడు, మునుగోడు ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు సుంకరి బిక్షం గౌడ్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా బిక్షం గౌడ్‌ను శాలువాతో సత్కరించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కమిట్‌మెంట్ ఉంటే ఏ పనినైనా సాధించవచ్చని, కృషి, పట్టుదల, దీక్షకు బిక్షం గౌడ్ నిదర్శనమని కొనియాడారు. ఉపాధ్యాయుడిగా అంకితభావంతో పనిచేస్తూ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేశారని ప్రశంసించారు. ఇలాంటి వ్యక్తులకు రిటైర్మెంట్ అనేది ఉండదని, ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు.సమాజంలో అవినీతి పెరిగిపోతోందని, అవినీతిని అరికట్టినప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. నాయకులు నీతిగా ఉంటేనే సమాజానికి నీతివంతమైన పాలన అందించగలరని అన్నారు. నాయకులు అవినీతికి పాల్పడితే పేదలకు న్యాయం జరగదని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ పార్టీ పేదలు, బడుగు బలహీన వర్గాల పార్టీ అని పేర్కొంటూ, బీసీలకు రాజకీయంగా పెద్దపీట వేయాలనే ఉద్దేశంతోనే బీసీ బిడ్డ అయిన సుంకరి బిక్షం గౌడ్‌కు పీఆర్టీయూ అభ్యర్థిగా టికెట్ ఇవ్వాలని తాను సూచించానని తెలిపారు. ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి నిర్ణయాన్ని గౌరవించాలని అన్నారు.

నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణపై కంచర్ల ఆగ్రహం







- **ఎక్స్‌రే విభాగానికి తాళం.. పారిశుద్ధ్యం అధ్వానం.. చిన్నారులకు కనీస వసతుల కరువు**
- **ఆసుపత్రిలో అన్ని వార్డులను పరిశీలించి సమస్యలను వైద్యుల దృష్టికి తీసుకెళ్లిన మాజీ ఎమ్మెల్యే**

నల్లగొండ నవంబర్ 07 (నేటి వెలుగు):

నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, నిర్వహణ లోపాలపై మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలు, వార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వస్తున్న పేద, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో అనేక సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. మూడేళ్ల క్రితమే మంజూరైన ఎంఆర్ఐ స్కాన్ సేవలు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సిటీ స్కాన్ సేవలు సక్రమంగా అందడం లేదని, త్రీడీ ఎక్స్‌రే విభాగానికి తాళం వేసి ఉండటంపై అధికారులను ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు నాణ్యమైన వైద్యం ఎలా అందుతుందని నిలదీశారు.ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల కేసులు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిపోతున్నాయని, ప్రైవేట్ ఆసుపత్రులతో కుమ్మక్కు కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతోందని కంచర్ల ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య కూడా తగ్గుతోందని పేర్కొంటూ, ఈ అంశంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.35 కోట్ల క్రిటికల్ కేర్ విభాగం నిరుపయోగం

తాము ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సుమారు రూ.35 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణాన్ని చేపట్టామని కంచర్ల తెలిపారు. ఇందులో 50 ఐసీయూ పడకలు, 25 డయాలసిస్ పడకలు ఏర్పాటు చేసి పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనులు చేపట్టినట్లు వివరించారు. అయితే ప్రస్తుతం ఆ విభాగం నిరుపయోగంగా ఉండటం బాధాకరమని అన్నారు.అప్పటికే రూ.20 కోట్లతో నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, మరో రూ.250 కోట్లు కేటాయించి 1,200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. కానీ ప్రస్తుతం నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు నిలిచిపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.నల్లగొండ జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఆసుపత్రి ఉన్నతాధికారులు తక్షణమే సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏఎంసీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, సింగం రామ్మోహన్, అభిమన్యు శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ దోటి శ్రీనివాస్, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, పెరిక యాదయ్య, పేర్ల మల్లీశ్వరి అశోక్, రత్నగిరి తారకమ్మ శ్రీనివాస్, కుందూరు దీపికా ప్రవీణ్ రెడ్డి, బాణావత్ దీప్లా, దొడ్డి రమేష్, గోపగోని స్వాతి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.అలాగే కనగల్ మండల పార్టీ అధ్యక్షులు ఐతగోని యాదయ్య, మాజీ కౌన్సిలర్లు రావుల శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల యాదగిరి, భాష పాక హరికృష్ణ, దండంపల్లి సత్తయ్య, మెరుగు గోపి, లతీఫ్, జమాల్ ఖాద్రి, పెరిక కరణ్ జయరాజ్, అశ్వాక్, అఫ్జల్, శంషుద్దీన్, సింగం లక్ష్మి, వజ్జ శ్రీనివాస్, వంటల అవినాష్, అశోక్ రెడ్డి, కంకణాల వెంకటరెడ్డి, కందుల లక్ష్మయ్య, అనిల్ నాయక్, నాగరాజు తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి క్రీడల వైపు అడుగులు వేయాలి

- **విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**
- **ఉత్కంఠభరితంగా కలెక్టర్ ఎలెవన్ -- ఎస్పీ ఎలెవన్ స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్**

నల్లగొండ, నవంబర్ 7 (నేటి వెలుగు):

నేటి సమాజంలో పిల్లలు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయిస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు వారిని క్రీడల వైపు ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.శనివారం నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో కలెక్టర్ ఎలెవన్, ఎస్పీ ఎలెవన్ జట్ల మధ్య నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విజయం సాధించిన ఎస్పీ జట్టుకు ట్రోఫీ అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధుల్లో నిత్యం బిజీగా ఉండే అధికారులు తమలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు మంచి అవకాశమని అన్నారు. ముఖ్యంగా 10 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు, పిల్లలకు క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ స్నేహపూర్వక మ్యాచ్ నిర్వహించినట్లు చెప్పారు. నేటి పిల్లలు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు అలవాటుపడి విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, తోటి వారితో మాట్లాడటం, కలిసిమెలిసి ఉండటం తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆలోచనా విధానం, క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందాలంటే వారిని క్రీడల వైపు మళ్లించాలని సూచించారు.

ఎస్పీ జట్టు ఘన విజయం

12 ఓవర్ల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జిల్లా కలెక్టర్ టాస్ వేయగా ఎస్పీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌లు ఇరు జట్లకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు స్వయంగా బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఎస్పీ జట్టు 118 పరుగులు సాధించి విజయం సాధించింది. కలెక్టర్ జట్టు 107 పరుగులతో రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా బెస్ట్ బౌలర్‌గా ఇరుగు రవి, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా శ్రీరామ్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా హరిబాబు ట్రోఫీలు అందుకున్నారు. విజయం సాధించిన ఎస్పీ జట్టును కలెక్టర్ అభినందించారు.

ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులతో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, స్థానిక కార్పొరేటర్ సుభాష్ కలిసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులు రూ.1.80 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, అడిషనల్ ఎస్పీ రమేష్, స్థానిక కార్పొరేటర్ సుభాష్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ పద్మ బాబుగౌడ్, చీఫ్ మేనేజర్ శ్రీరాములు, కలెక్టరేట్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఆర్. సౌమిత, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్, కామెంటేటర్ గిరిబాబు, రెవెన్యూ, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.





Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**